'ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి'

హిమాయత్‌నగర్, మార్చి13: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన నాలుగు వందల ఎకరాల భూమిని వేలం వేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన భూమిని వేలం వేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు.ఈ భూమి విలువ సుమారు రూ.10 వేలకోట్లు ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటూ మరో పక్కన ప్రభుత్వ విద్యాసంస్థల భూముల అమ్మకాలను ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఆ భూమి భవిష్యత్తులో విద్యార్థుల శ్రేయస్సు , పరిశోధనలకు ఉపయోగపడేలా ప్రభుత్వం కృషి చేయాలే తప్ప అమ్మకానికి పెట్టడం పద్ధతి కాదన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మణికొండలో ట్రాఫిక్ రద్దీపై చర్యలు తీసుకోవాలి

ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు

మణికొండ, మార్చి 13 : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో తక్షణమే చర్యలు చేపట్టి మార్చి 21 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా తగు చర్యలు చేపట్టాలని కోరుతూ గురువారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ధూళిపాళ్ల సీతారాం ఆధ్వర్యంలో డీసీపీ సాయి మనోహర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిచెట్టు సర్కిల్, చింతచెట్టు సర్కిల్, పాత ఆంధ్రా బ్యాంకు, లాలమ్మ గార్డెన్, పంచవటి కాలనీ కూడళ్ల వద్ద వాహనాల రద్దీ మరీ ఎక్కువగా ఉంటుందని కావున సంబంధిత అధికారులకు ఆదేశాలిస్తూ ట్రాఫిక్ రద్దీని మళ్లించే చర్యలు చేపట్టాలని సీతారాం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు కుంభగల్ల ధనరాజ్ గుట్ట మీది నరేంద్ర, ముత్తంగి లక్ష్మయ్య, యాలాల కిరణ్, భాను చందర్, సుమనళిని, బొడ్డు శ్రీధర్, యాలాల బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు కనిపిస్తలేదా..!

హైదర్‌గూడ పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 145 వద్ద కంపుకొడుతున్న డ్రైనేజీ వ్యవస్థ

హైదర్‌గూడ ప్రధాన రహదారిపై ఏరులై పారుతున్న డ్రైనేజీ మురుగు నీరు

ప్రజాపాలనలో..డ్రైనేజీ వ్యవస్థ ఇలా..!

నిత్యం వందల సంఖ్యల్లో వాహనాలు, పాదచారులు వెళ్తుంటారు. ఆ దారి గుండానే ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్తుంటారు.అదే పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే..వివరాలోకి వెళ్తే.. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ పీవీ.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 145 వద్ద జాయ్ ఆసుపత్రి దగ్గరలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పాడైపోయింది. ఫలితంగా కొన్ని రోజులుగా డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతుంది. అధికారులకు ఫిర్యాదులు చేస్తే నామమాత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో తిరిగి సమస్య యథాస్థితికి వస్తున్నది. ఈ ప్రాంతంలోనే బస్‌స్టాప్ ఉండడంతో బస్సుల కోసం వేచి చూసే ప్రజలు ఈ మురుగు నీటిలోనే వేచి ఉండాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ సమ్స్య లేకుండా చూడాలని వాహనదారులతో పాటు పాదచారులు కోరుతున్నారు.– మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 13:

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టినరోజు సందర్భంగా గురువారం మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు పట్లోళ్ల రూపారెడ్డి ఆధ్వర్యంలో తన సొంత నిధులతో నాయిని సందీప్ రెడ్డి అనే దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను అందజేశారు. అనంతరం స్థానిక మహిళలతో కలిసి పెద్ద ఎత్తున గురువారం ఎమ్మెల్సీ కవిత నివాసానికి వెళ్లి భారీ గజమాలతో సత్కరించి అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మహిళా విభాగ నాయకురాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – మణికొండ, మార్చి 13 :

కిడ్నీలను పరిరక్షించుకోండి

కిడ్నీలపై అవగాహన కల్పిస్తున్న విరించి వైద్యులు

సిటీబ్యూరో, మార్చి 13(నమస్తే తెలంగాణ) బంజారాహిల్స్ విరించి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రపంచ మూత్రపిండాల దినం సందర్భంగా కిడ్నీ ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూత్ర పిండాల ఆరోగ్యాన్ని పెంపొందించేలా వైద్య, చికిత్స, జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన కల్పించారు. గురువారం హాస్పిటల్ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో నెఫ్రాలజీ విభాగం డా.కేఎస్ నాయక్, డా. నవీన్ కుమార్, డా. రవికుమార్, ఆధ్వర్యంలో మూత్ర పిండాల వ్యాధులకు మెరుగైన చికిత్సలను అందిస్తున్నట్లు తెలిపారు. డయాలసిస్, పెరిటోనియల్ డయాలసిస్, మూత్ర పిండాల మార్పిడి వంటి అంశాల్లో మెరుగైన వైద్య విధానాలను అందిస్తున్నట్లుగా తెలిపారు. ఇప్పటివరకు ఎంతో సంక్లిష్టమైన మూత్రపిండాల వ్యాధులకు చికిత్స చేసి రోగులను కాపాడామన్నారు.

బండ్లగూడలో రోడ్డు విస్తరణ కోసం..

బండ్లగూడలో రోడ్డు విస్తరణ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న హెచ్ఆర్డీసీఎల్ అధికారులు

బండ్లగూడ, మార్చి 13: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టనున్న 100 ఫీట్ల రహదారులను గురువారం హెచ్ఆర్డీసీఎల్ అధికారులు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా 100 ఫీట్ల రోడ్డుకు అవసరమైన ల్యాండ్ సేకరణ, స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్‌డీసీ అధికారులు ఎస్సీ శ్రీనివాస్, డీఈఈ కిషోర్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర, జూనియర్ అధికారులు యాదయ్య రాజకుమార్, టౌన్ ప్లానింగ్ అధికారులు వాణి తదితరులు పాల్గొన్నారు.

చెత్త బయట వేస్తే .. దుకాణాలకు జరిమానాలు

వ్యాపార సముదాయాల ముందు డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోకుండా చెత్త రోడ్డుపై వేసి దుకాణాలు మూసివేసి వెళ్తే చలాన్లు విధించాలని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా ఆదేశించారు. గురువారం ఎస్ఎఫ్ఏ లతో సమావేశం నిర్వహించి పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై మరింత కఠినంగా వ్యవహరించాలని.. వారికి కూడా జరిమానాలు విధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం ఓ హెచ్ డాక్టర్ సాల్మన్ రాజ్, శానిటరీ సూపర్‌వైజర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.– జూబ్లీహిల్స్

రాష్ట్రంలో నియంతృత్వ పాలన

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 13: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రాథమిక హక్కులను హరించివేయడమే కాకుండా అసెంబ్లీలో సైతం ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతు నొక్కుతూ నియంతృత్వ పాలన సాగిస్తుందని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీలో ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ప్రశ్నించిన ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని అకారణంగా కక్షపూరితంగా అసెంబ్లీ నుంచి ఈ సెషన్స్ పూర్తి అయ్యేవరకు సస్పెండ్ చేయడం దారుణమన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత మొబైల్ కిడ్నీ పరీక్షా శిబిరాలు

వాహనాన్ని ప్రారంభించిన డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్

వాహనాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నరేంద్ర కుమార్

ఖైరతాబాద్, మార్చి 13 : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉచిత మొబైల్ కిడ్నీ పరీక్షా శిబిరాలను ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఎండీ డాక్టర్ మల్లికార్జున్ తెలిపారు. ఈ మేరకు ఎర్రమంజిల్‌లోని ఆస్పత్రి ఆవరణలో మొబైల్ కిడ్నీ పరీక్షా వాహనాన్ని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఎ.నరేంద్ర కుమార్‌తో కలిసి ప్రారంభించారు. డాక్టర్ మల్లికార్జున్ మాట్లాడుతూ గ్రామాల్లో కిడ్నీ వ్యాధులపై సరైన అవగాహన లేక చాలా మంది ఆలస్యంగా ఆస్పత్రులకు వస్తున్నారన్నారు. ఈ మొబైల్ వాహనం ద్వారా అవగాహన కల్పించడంతో పాటు ఉచిత పరీక్షలు సైతం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ పూర్ణచంద్రారెడ్డి, సీఈవో సందీప్ పాల్గొన్నారు.

నిమ్స్‌కు 20 వీల్ చైర్లు అందజేత

తన తల్లికి మెరుగైన చికిత్స అందించిన నిమ్స్ దవాఖానకు కృతజ్ఞతగా ఓ వ్యక్తి తన వంతు సాయం అందించాడు. నల్గొండ జిల్లాకు చెందిన రాఘవేంద్ర రెడ్డి తల్లి జయప్రద కొంత కాలంగా కీళ్ల సమస్యతో బాధపడుతున్నది. నిమ్స్ దవాఖానలో వైద్యులు విజయవంతంగా కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె సంపూర్ణంగా కోలుకోవడంతో పాటు దీర్ఘకాలికంగా కలుగుతున్న ఇబ్బందులు దూరమయ్యాయి. దీంతో ఆమె కొడుకు రాఘవేంద్ర నిమ్స్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ తన వంతు సాయంగా 20 వీల్ చైర్లను అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రను నిమ్స్ యాజమాన్యం అభినందించింది. – ఖైరతాబాద్, మార్చి 13 :

వర్గీకరణలో మాలలు, ఉపకులాలకు అన్యాయం

సమావేశంలో అభివాదం చేస్తున్న చెన్నయ్య తదితరులు

ఖైరతాబాద్, మార్చి 13 : ఎస్సీ వర్గీకరణలో మాలలు, ఉపకులాలకు తీరని అన్యాయం జరిగిందని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి. చెన్నయ్య అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఎంపరికల్ డేటా లేకుండా, కులాల వారీగా గ్రూపులుగా విభజించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దీనిపై మాల ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో నిలదీయాలన్నారు. ఈ వర్గీకరణ ద్వారా ఆయా గ్రూపులలోని కులాల మధ్య కొంత కాలం తర్వాత సూక్ష్మ వర్గీకరణకు డిమాండ్ వస్తుందని, తద్వారా దళిత జాతి మరింత విచ్ఛిన్నమవుతుందని, మనువాదులకు కావాల్సింది అదేనని, దీనిని మందకృష్ణ అమలు చేసే పనిలో ఉన్నారని ఆరోపించారు. గ్రూప్ పరీక్షల నోటిఫికేషన్లకు ముందే వర్గీకరణ అందులో అమలు చేయాలని డిమాండ్ చేయాల్సిందని, కానీ ప్రస్తుతం ఫలితాలు వచ్చిన తర్వాత మందకృష్ణ వర్గీకరణ ఆధారంగా అవకాశాలు కల్పించాలని కోరుతున్నాడని, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడవద్దన్నారు. ఈ సమావేశంలో మన్నె శ్రీధర్, నాను, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీసీ ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ ముస్లిం జేఏసీ డిమాండ్

ఖైరతాబాద్, మార్చి 13 : బీసీ ముస్లింలకు ఉద్యోగం, రాజకీయ రంగాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ ముస్లిం జేఏసీ డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆల్ ఇండియా పస్మందా ముస్లిం మహాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అద్నాన్ కమర్, తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల సంఘం అధ్యక్షులు షబ్బీర్ షేర్ అలీలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ ఏ, బీ, ఈ గ్రూపుల్లో మొత్తం 19 పస్మందా బీసీ ముస్లిం వర్గాలున్నాయాన్నారు. నేటికీ విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో పూర్తిగా వెనుకబడి ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన ఆధారంగా బీసీలకు విద్య, ఉద్యోగంతో పాటు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను కలిపిస్తున్నారని, అదేవిధంగా బీసీ ముస్లింలకు సైతం 10 శాతం కలిపి మొత్తం 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యునైటెడ్ ముస్లిం మైనార్టీ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి ముజాహిద్, తెలంగాణ తుర్క కాషా సంక్షేమ సంఘం ప్రతినిధి ఇమామ్ పాషా, తెలంగాణ రాష్ట్ర ఫకీర్ బీసీ ఈ సంక్షేమ సంఘం ప్రతినిధి ఫరీద్, తెలంగాణ నూర్ బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ప్రతినిధి షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మూత్ర పిండాల వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

జ్యోతి వెలిగించి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు, చిత్రంలో ఏసీపీ హరిప్రసాద్

ఖైరతాబాద్, మార్చి 13 : మూత్రపిండాల వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా సోమాజిగూడలోని ఓ ప్రైవేట్ దవాఖానలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, ఆస్పత్రి నెఫ్రాలజీ వైద్య నిపుణులు డాక్టర్ వి. రమేశ్, డాక్టర్ సయ్యద్ మహ్మద్‌తో కలిసి ప్రారంభించారు. ఏసీపీ హరిప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని భావితరాలకు అందించాలన్న సంకల్పంతో వైద్యులు పనిచేయాలన్నారు. మూత్ర పిండాల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు.

నూనెగింజల ఉత్పత్తి మరింత పెరగాలి

వీసీ డా.దండా రాజిరెడ్డి

సదస్సులో మాట్లాడుతున్న డా. రాజిరెడ్డి తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 13: దేశానికి సరిపడ నూనెగింజలను ఉత్పత్తి చేసే అవకాశాలు తెలంగాణలోనే ఉన్నాయని ,శాస్త్రవేత్తలు మరింత కృషి చేస్తే రైతులు ఫలితాలు సాధించగలరని ఎస్‌కేఎల్‌హెచ్‌టీయూ ఉపకులపతి డా.దండా రాజిరెడ్డి అన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా, చీడ పీడలను తట్టుకునే నూతన వంగడాలను మరిన్ని మార్కెట్‌లోకి తీసుకురావాలని సూచించారు. డ్రోన్ సాంకేతికతను అందిపుచ్చుకోవడం, సాగు విస్తీర్ణం మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఐఐఓఆర్ నిర్దేశకులు డా. రవికుమార్ మాథూర్ మాట్లాడుతూ రెండు, మూడు పంటలను సాగు చేస్తూ అన్ని అనుబంధ సంస్థల సమ్మేళితంగా వ్యవసాయం చేస్తే ఎలాంటి నష్టాల బారిన రైతులు పడకుండా ఉంటారని, అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చన్నారు. మన దేశంలో ఇతర ప్రాంతాలనుంచి నూనెలను ఇప్పటికి దిగుమతి చేసుకుంటున్నామని గుర్తు చేశారు. మనదేశంలో ఎక్కువ పండిస్తే ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలుంటాయన్నారు. రైతుల సందేహాలు , సమస్యలకు శాస్త్రవేత్తలు, సంబంధిత అధికారులు తగు సలహాలు, సూచనలు చేశారు .ఐఐఓఆర్ డా. శారద, నూనెగింజల పంటలలో అధిక దిగుబడులిచ్చే పంటలను రైతులు మేలైన రకాల విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం , ఐసీఏఆర్ సంస్థలు రైతులకు అందుబాటులో ఉంటాయని విస్తరణ సంచాలకులు డా. ఏకాద్రి అన్నారు.
రైతులకు లభిస్తున్న వివిధ రకాల సబ్సిడీల వివరాలు ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ డా. సరోజినీ దేవి వెల్లడించారు. నూనెగింజలను సాగుచేసే ఔత్సాహిక రైతులు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు , స్వయం సహకార సంఘాలు ప్రతినిధులు, తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పలు కాలనీల్లో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

మైలార్‌దేవ్‌పల్లి టీఎన్‌జీవోస్ కాలనీలో.. ..

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 13: అక్రమ నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేస్తమని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీలోని సర్వే నెంబర్ 156/1లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను గురువారం కూల్చివేశారు. ఉపకమిషనర్ ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల భారీ బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎన్‌జీవోస్ కాలనీలోని స్థలాలను ఆక్రమించి రాత్రికి రాత్రి నిర్మాణాలను చేపడుతున్నారన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించమన్నారు.
అత్తాపూర్‌లో... అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని యాంబియన్స్ ఫోర్టులో కూడా అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు అదనపు అంతస్తు నిర్మాణంతో పాటు పెంట్‌హౌస్‌లోని నిర్మాణాలను కూల్చివేశారు.

డబ్బులు లాక్కున్న ట్రాన్స్‌జెండర్ అరెస్ట్

బంజారాహిల్స్,మార్చి 13: రోడ్డుమీద వెళ్తున్న వ్యక్తిని మాటల్లోకి దించి డబ్బులు లాక్కున్న ట్రాన్స్‌జెండర్‌ను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జహీరానగర్‌లో నివాసం ఉంటున్న షేక్ రఫీ(24) అనే యువకుడు హోటల్‌లో పనిచేస్తుంటాడు.మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత విధులు ముగించుకుని ఇందిరానగర్‌లోని తన స్నేహితుడిని కలిసేందుకు వెళ్తున్న క్రమంలో రోడ్డుమీద ట్రాన్స్‌జెండర్ కనిపించింది. రఫీతో మాట్లాడుతూ అతడిని పొదల్లోకి వెళ్లామంటూ కోరింది. అదే సమయంలో కొంతమంది యువకులు పోలీస్‌ల మంటూ బైక్‌లమీద అరుచుకూంటూ వెళ్తుండడంతో రఫీతో మాట్లాడుతున్న ట్రాన్స్‌జెండర్ అతడి జేబులోంచి రూ.1500 తీసుకుని పారిపోయింది.ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీలతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో రూ.1500 లాక్కుని వెళ్లింది ఇందిరా నగర్‌లో నివాసం ఉంటున్న ట్రాన్స్‌జెండర్ కంగనా అలియాస్ శ్రీజ(32) అని గుర్తించారు. దీంతో గురువారం కంగనా అలియాస్ శ్రీజను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

బాలుడిపై అసభ్యకర ప్రవర్తన

వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్,మార్చి 13: చాక్లెట్ ఇప్పిస్తానంటూ నాలుగేళ్ల బాలుడిని తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. టోలీచౌకి సమీపంలోని హకీంపేట కుంటలో నివాసం ఉంటున్న బాలుడు(4) బుధవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న వ్యక్తి (40) బైక్ మీద అక్కడకు వచ్చి చాక్లెట్ ఇస్తానంటూ బాలుడిని నిర్మానుష్యప్రాంతంలోకి తీసుకెళ్లి బాలుడిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలుడు పరుగెత్తుకుంటూ వచ్చి తండ్రికి విషయం చెప్పడంతో ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

హైదర్‌గూడలో.. కామ దహనం

హోలీ పండుగను పురస్కరించుకొని ప్రజలు గురువారం రాత్రి కామ దహనం చేశారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహం ప్రాంతం, రాంబాగ్, చైతన్య విల్లాస్ తదితర ప్రాంతాల్లో కాముడి దహన కార్యక్రమాలను చేపట్టారు. ప్రజలు తమ ఇంట్లోని పాత సామాగ్రిని తీసుకొచ్చి కాముడి కంతలో వేశారు. –మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 13

మొల్ల జయంతి సందర్భంగా...

కవయిత్రి కుమ్మరి మొల్లమంబ జయంతిని గురువారం శంషాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ లీగల్‌సెల్ అధ్యక్షుడు కొన్నమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. –శంషాబాద్

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

హిమాయత్ నగర్, మార్చి 13: ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ అన్నారు. గురువారం హైదర్‌గూడలోని ఓహోటల్‌లో ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైనర్లు సమాజంలో మార్పునకు అత్యంత కీలకమైన వ్యక్తులని, నాణ్యత గల శిక్షకుల అవసరమన్నారు.మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు.కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ అనుమతితో ప్రభుత్వం గుర్తించిన సర్టిఫికెట్లను ట్రైనింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు అందజేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో నిపుణులు డాక్టర్ గౌతం నంది, డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి, సంఘం నేతలు డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ శ్రీ పూజ, జగదీశ్వర రావు, వేణుగోపాల్, డాక్టర్ రవి సిద్ధుల తదితరులు పాల్గొన్నారు.

ట్రైనర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రాంచందర్